## ఇసుక అక్రమ తవ్వకాలు పూర్తి స్థాయిలో నిర్మూలించాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లాలో ఇసుక అక్రమ త్రవ్వకాలు పూర్తి స్థాయిలో నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు.జిల్లాలో ఇసుక రీచ్‌లను గుర్తించాలన్నారు. అక్రమ ఇసుక త్రవ్వకాలని పూర్తి స్థాయిలో నివారిస్తామని చెప్పారు. కేవలం మన ఇసుక వాహనం యాప్ ద్వారానే ఇసుక అమ్మకాలు పారదర్శకంగా జరగాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా చూడాలన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టినా, రవాణా చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీ రత్న కళ్యాణి, భూగర్భజల అధికారి శ్రీనివాస బాబు, డిపిఓ, శ్రీనివాస్ , రాయల్టీ ఇన్స్‌పెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు సిబ్బంది, పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఖాళీల భర్తీ



ప్రజాపక్షం/ఆసిఫాబాద్: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి కేంద్రంలో ఖాళీలను పొరుగు సేవల ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఇంటర్వ్యూలు పారదర్శకంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ కె. హరిత తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు ఆమె కమిటీ సభ్యులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ ఆధారంగానే ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఒక సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుకు ఎనిమిది మంది, ఒక న్యాయ సలహాదారు పోస్టుకు నలుగురు, ఒక కేస్ వర్కర్ పోస్టుకు ఆరుగురు, ఒక ఐటీ అసిస్టెంట్ అకౌంటెంట్ పోస్టుకు ఆరుగురు, ఒక మల్టీపర్పస్ వర్కర్ పోస్టుకు 32 మంది అభ్యర్థులు హాజరయ్యారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి స్వరూపారాణి, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయంగా మందుల సరఫరా

మెదక్ జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ

ప్రజాపక్షం/మెదక్ : అఖిల భరత ఆర్గనైషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ పిలుపు మేరకు 20 వ తేదీన నిర్వహించనున్న బంద్ కారణంగా మెదక్ జిల్లాలోని మెడికల్ షాపులు ఎక్కువగా మూసివేయబడే అవకాశం ఉంది. అందులో భాగంగానే ప్రజలకు అవసరమైన అత్యవసర మరియు ప్రాణరక్షక మందుల సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా డ్రగ్స్ కంట్రోల్ అడ్మిని స్ట్రేషన్ తరపున ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయబడుతుందని జిల్లా డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చంద్రకళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర మందుల అవసరమేతే ప్రజాలు క్రింది నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. హెల్ప్ డెస్క్ నంబర్లు : 9440155858, 9440025572, 9985466335, డ్రగ్స్ హెల్ప్‌లైన్ నంబర్ : 18005996968, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, మెదక్ జిల్లా 8333818140 ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఫార్మసీలు మందుల సరఫరాకు అందుబాటులో ఉంటాయని వివరించారు. ప్రజలు ఆందోళన చెందకుండా అవసరమైన సేవలను వినియోగించుకోవాలని చంద్రకళ తెలిపారు.

## అన్నదాతల ఆగ్రహం.. రోడ్డుపై ధర్నా



ప్రజాపక్షం/వెల్దుర్తి: ధాన్యం కొనుగోలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నదాతలు ఆగ్రహించి రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో ధర్నా చేపట్టిన సంఘటన వెల్దుర్తి మండలంలోని మన్నెవారి జలాల్ పూర్ గ్రామంలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామంలో సుమారు 25 లారీల ధాన్యం ఉందని ఇప్పటివరకు తూతూ మంత్రంగా రెండు లారీల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసి చేతులు దులుపుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని వెంటనే లారీలను అందుబాటులో ఉంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల కష్టాలను తీర్చాలని అన్నారు. దీంతో వెల్దుర్తి, నర్సాపూర్, ప్రధాన రహదారి సుమారు మూడు గంటల పాటు రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారులు ఎండలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న వెల్దుర్తి తహసిల్దార్ శ్రీనివాస్, రైతుల వద్దకు చేరుకొని త్వరలోనే ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.

## సేంద్రియ సాగుతోనే పౌష్టికాహారం

ప్రజాపక్షం/కాగజ్ నగర్ : సేంద్రీయ పద్ధతులను అనుసరిస్తేనే ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని శాస్త్రవేత్తలు డాక్టర్ సిహెచ్ భరత్ భూషణ్ రావు, డాక్టర్ డి శిరీష సూచించారు.మండలంలోని జాం బుగా రైతువేదికలో మంగళవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాత అవగాహన కార్యక్రమంలో వారు రైతులకు పంటల సాగుపై పలు సూచనలు చేశారు. రైతులు తక్కువ యూరియా వినియోగించి సాగు ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలనే సాగు చేయాలని, అవసరం మేరకే రసాయనాలను వినియోగించాలని తెలిపారు. పంట మార్పిడి పాటించడం ద్వారా సుస్థిర ఆదాయం పొందవచ్చని, సాగునీటిని ఆదా చేసి భావితరాలకు అందించాలని వివరించారు.వ్యవసాయ అధికారి రామకృష్ణ, సహాయ వ్యవసాయ అధికారి సృజన, ఆత్మ శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ గజ్జి లింగయ్య, ఉప సర్పంచ్ కట్టేకోల పోచమల్లు, రైతులు పాల్గొన్నారు.



# బోగస్ ఓట్లపై బ్రహ్మాస్త్రం..

- నిర్మల్ జిల్లాలో 7.47 లక్షల ఓట్లపై ఇసిఐ ప్రత్యేక నజర్! ● జూన్ 25 నుండి జులై 24 వరకు ఇంటింటి సర్వే ● నకిలీ, ద్విత్వ ఓట్ల ఏరివేతకు శ్రీకారం
- పకడ్బందీగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ
- జిల్లా జనాభా, తాజా ఓటర్ల వివరాల ఆధారంగా ప్రత్యేక నిఘా



ప్రజాపక్షం / నిర్మల్ : జిల్లాలో నకిలీ మరియు బోగస్ ఓట్లను పూర్తిగా అరికట్టి, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సరికొత్త ప్రణాళికలతో సమయత్తమవుతోంది. ఇందులో భాగంగానే ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మూడో దశ ప్రక్రియకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ విడుదలైంది. జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ల్పించడంతో పాటు, ఒకే ఓటరుకు రెండు మూడు చోట్ల ఉన్న ఎట్లను, మరణించిన వారి మరియు శాశ్వతంగా వలస వెళ్ళిన వారి ఓట్లను పూర్తిగా తొలగించడమే లక్ష్యంగా ఈ భారీ కసరత్తు జరగనుండి. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులతో ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశారు. నిర్మల్ జిల్లా పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాలైన నిర్మల్, ముథోల్, ఖానాపూర్ పరిధిలో ఈ ప్రక్రియను పకడ్బందీగా విజయవంతం చేసేందుకు రెవెన్యూ మరియు ఎన్నికల విభాగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తుంది.

### జూన్ 25 నుండి ఇంటింటికి బిఎల్ఒలు

ఈ ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా జూన్ 15 నుండి జూన్ 24 వరకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బూత్ లెవెల్ అధికారులు మరియు సూపర్‌వైజర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తారు. జూన్ 25 నుండి జులై 24 వరకు నెల రోజుల పాటు సుదీర్ఘంగా బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఇంటికి వెళ్ళి క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలను సేకరిస్తారు. ఈ ఇంటింటి సర్వే ఆధారంగా జులై 31న జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఆపై జులై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు ముసాయిదా జాబితాపై ప్రజల నుండి అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణకు దరఖాస్తులను స్వీరిస్తారు. చివరగా అన్ని రకాల సవరణలు మరియు పరిశీలనలు పూర్తి చేసి అక్టోబర్ 1న అత్యంత పారదర్శకమైన తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారు. ఈసారి సవరణ ప్రక్రియను మరింత శాస్త్రీయంగా నిర్వహించేందుకు 2002 2025 నాటి ఓటర్ల డేటాను క్రోడీకరించి ఓటర్లను నాలుగు విభాగాలుగా వర్గీకరించారు. 39 ఏళ్ళపైబడి, 2002 ఓటర్ల జాబితాలో నమోదై ఉన్నవారిని మొదటి కేటగిరిగాను, అంతే వయసు ఉండి నాటి జాబితాలో పేరు లేని వారిని రెండో కేటగిరీగాను విభజించారు. అలాగే 21 నుండి 38 ఏళ్ళ లోపు ఉండి 1987 నుండి 2004 మధ్య జన్మించిన వారిని మూడో కేటగిరిగాను, 18 నుండి 20 ఏళ్ళలోపు గల యువ ఓటర్లను నాలుగో కేటగిరిగాను వర్గీకరించి ప్రత్యేక నిఘా సారించనున్నారు. ముఖ్యంగా నిర్మల్ జిల్లాలోని 3 మున్సిపాలిటీలతో పాటు చుట్టుపక్కల గ్రామీణ ప్రాంతాల్లో ఒకే ఓటరుకు రెండు చోట్లా ఓట్లు ఉన్నట్లు గతంలో పలు ఫిర్యాదు లు వ చ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కొ ందరు రాజకీయ నాయకులు తమ ప్రయోజనాల కోసం గ్రా మీణ ఓటర్లను పట్టణాల్లోనూ, పట్టణ ఓటర్లను గ్రా మాల్లోనూ నమోదు చేయిస్తున్నారనే విమర్శలు ఉన్నా యి. మున్సిపల్ ఎన్నికల్లో పట్టణంలో, సర్పంచ్ ఎన్నికల్లో గ్రామంలో ఓటు వేస్తూ కొందరు ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా ఒకే కుటుంబానికి చెందిన ఓట్లను ఒకే బూత్ ప రిధిలోకి తీసుకురావడంతో పాటు, రెండు చోట్ల ఉన్న ఓ ట్లను క్షేత్రస్థాయి పరిశీలనా ద్వారా తొలగించనున్నారు.

### జనాభా వంచనపై డేటా నిఘా

జూన్ 25 నుండి ప్రారంభం కానున్న ఈ ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా జిల్లా జనాభా నిష్పత్తికి, ప్రస్తుతం ఉన్న ఓటర్ల సంఖ్యకు మధ్య గల వ్యత్యాసాలను ఎన్నికల విభాగం నిశితంగా పరిశీలిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం నిర్మల్ జిల్లా మొత్తం జనాభా 7,09,418 గా ఉంది. ఇందులో పురుషుల జనాభా 3,46,721 కాగా, మహిళల జనాభా 3,62,697 గాఉంది కాగా, జిల్లా పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం ఓటర్ల సంఖ్య 747644 గా ఉంది. నియోజకవర్గాల వారిగా పరిశీలిస్తే నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 261087 ఓట్లు, ముథోల్ నియోజకవర్గంలో 258406 ఓట్లు, అలాగే ఖానాపూర్ నియోజకవర్గంలో 228151 ఓట్లు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఇంటింటి సర్వేకు వచ్చే బూత్ లెవెల్ అధికారులకు ఓటర్లు తాము నివసిస్తున్నట్లు నిరూపించుకోవడానికి ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల గుర్తింపు కార్డులలో ఏదో ఒకదానిని చూపించి తమ ఓటును ధృవీకరించుకోవాల్సి ఉంటుంది. జిల్లాలోని ఓటర్లందరూ ఈ ప్రక్రియకు సహకరించి ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగస్వాములు కావాలని అధికారులు కోరుతున్నారు.

## గిరిజన మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

కలెక్టర్ రాజర్షి షా



ప్రజాపక్షం/ మావల: గిరిజన మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూర్‌లో నిర్వహించిన మత్స్యకారుల అవగాహన సదస్సుకు ఆయన, ఐటీడీఏ పీఓ మంద మకరంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మత్స్యకారులు ఆధునిక పద్ధతుల్లో చేపల పెంపకం చేపట్టాలని, వారికి సబ్సిడిపై వాహనాలు, ఐస్ బక్సుల పంపిణీకి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ప్రమాద భీమా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ నిరుద్యోగ గిరిజన యువతకు మత్స్య రంగంలో స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక నిధులు, రాయితీ రుణాలు అందిస్తామన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం



ప్రజాపక్షం/ హాజీపూర్/ నస్పూర్: వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని హాజీపూర్ మండలం సబ్బపల్లి, నస్పూర్ మండలం, లక్షెట్టిపేట మండలం గుల్లకోట, వెంకట్రావుపేటలలోని కొనుగోలు కేం ద్రా లు, గోదాములు, రైస్ మిల్లులను మంగళవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేకుండా తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించడంతో పాటు గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, తే మ యంత్రాలు అందుబాటులో ఉంచాలని సూ చించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన విధంగా రైస్ మిల్లులకు, గోదాములకు తరలించాలన్నారు. రైస్ మిల్లుల నిర్వాహకులు ధా న్యాలను వేగంగా దిగుమతి చేసుకోవడానికి హమాలీల సంఖ్యను పెంచుకోవాలని, లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు. లారీల యజమానులు ధాన్యం తరలింపులో నిబంధనలు పాటించాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు దిలీప్ కుమార్, రోహిత్ దేశ్ పాండే, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ధాన్యం కొనుగోలు:చంద్రయ్య



ప్రజాపక్షం/జైపూర్ /మంచిర్యాల : ప్రభుత్వం చేపట్టిన ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య అధికారులను ఆదేశించారు. జైపూర్ మండలం షెట్ పల్లి, కుందారం, గంగిపల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి హామీ, పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఆలస్యం జరగకుండా లారీలను వెంటనే సమకూర్చాలని రవాణా కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం త్వరితగతిన కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కుందారంలో ఉపాధి హామీ పనులను పరిశీలించి కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించాలని ఆదేశించారు. ఒక మహిళ భర్త మరణంతో ఉపాధి హామీ కూలి డబ్బులు నిలిచిపోయాయని కోరగా వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి బాపులను ఆదేశించారు. గ్రామాల అంతర్గత రహదారులు, మురుగు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డివిజనల్ పంచాయతీ అధికారి ధర్మారాణి, ఏపీఎం సంతోష్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు విస్తృత తనిఖీలు

ప్రజాపక్షం/శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నిర్మూలనకు ప్రాధాన్యత ఇస్తూ చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా శ్రీరాంపూర్ పట్టణంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆకుల అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందం నార్కోటిక్ డాగ్ సహాయంతో బస్ స్టాండ్ పరిసర ప్రాంతాలు, పాన్ షాపులు, దుకాణాలు, వైన్ షాపులు, ఖాళీ స్థలాలు, ప్లే గ్రౌండ్స్‌తో పాటు పట్టణంలోని పలు అనుమానాస్పద ప్రాంతాల్లో మంగళవారం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంపై నిఘా మరింత కట్టుదిట్టం చేస్తున్నామని తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా నిరోధించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు లేదా గంజాయి సంబంధిత సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతో గంజాయి నిర్మూలనకు కట్టుబడి ఉన్నామని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్యం వికటించి పసికందు మృతి

డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమని..

ఆసుపత్రి ముందు కుటుంబీకుల ఆందోళన




ప్రజాపక్షం/నర్సాపూర్: వైద్యం వికటించి ఓ పసికందు మృతి చెందిన సంఘటన నర్సాపూర్ పట్టణంలోని మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు కుటుంబీకుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. నర్సాపూర్ మండల పరిధిలోని జక్కపల్లి గ్రామానికి చెందిన మంజుల ఆంజనేయులు దంపతుల 8 నెలల పసికందు మణిదీప్‌కు సోమవారం మూడు గంటల సమయంలో జ్వరం వచ్చిందని నర్సాపూర్ లోని అమ్మ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. అనంతరం బాలుడికి పరీక్షలు నిర్వహించిన ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని చికిత్సలు జరిపారు. అయితే మంగళవారం ఉదయం వైద్యులు పసికందు చిన్నారి మణి దీప్ పరిస్థితి విషమంగా ఉందని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు చెప్పారు. వెంటనే కుటుంబీకులు బాలుడిని అంబులెన్స్‌లో సంగారెడ్డి ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. సంగారెడ్డి ఆసుపత్రిలో అక్కడి వైద్యులు పరీక్షించగా అప్పటికే బాలుడు చనిపోయినట్లు చెప్పారు. పసి కందు బాలుడు మణికంఠ మృతికి కారణమైన వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబీకులు డిమాండ్ చేశారు. అమ్మ ఆసుపత్రిలో ఇటువంటి అల్లర్లు జరగకుండా ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చేశారు.

## 21 నుండి ఇంటర్ సప్లిమెంటరీ మూల్యాంకనం

అధ్యాపకులను రిలీవ్ చేయకుంటే చర్యలు

ప్రజాపక్షం/నిజామాబాద్: మే 21 నుండి ఇంటర్ సప్లమెంటరీ మూల్యాంకనం ప్రారంభం కానుందని, అధ్యాపకులను రిలీవ్ చేయకుంటే చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఇంగ్లీష్, మ్యాథ్స్ పొలిటికల్ సైన్స్ (సివిక్స్) సబ్జెక్టుల అధ్యాపకులందరూ మే 21 న నిజామాబాద్‌లోని ఇంటర్ మూల్యాంకనం కేంద్రంలో రిపోర్ట్ చేయాలన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అన్ని రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్ వారి కళాశాల లాగిన్లలో అధ్యాపకుల అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇంటర్ బోర్డు నిక్షిప్తం చేసిందని, మూల్యాంకన విధులున్న అధ్యాపకులను 20న రిలీవ్ చేయాలని ప్రిన్సిపాల్‌లను ఆదేశించారు.

# ముత్యాల చెరువుకు మరమ్మతులు

ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన ఇరిగేషన్ అధికారులు



ప్రజాపక్షం/నిజామాబాద్: ధర్పల్లి మండలం హోన్నాజీపేట్ ముత్యాల చెరువు మరమ్మతులు, ప్రోటెక్షన్ వాల్, మండలంలో చెక్‌డ్యామ్‌లు తదితర అంశాలపై ఇరిగేషన్ అధికారులు ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసి చర్చించారు. మంగళవారం ఎమ్మెల్యేను వారి నివాసంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. దీంతో మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు విన్నవించారు. ఈ మేరకు మరమ్మతుల పనులకు సంబంధించిన ప్రణాళికను మ్యాప్ పాయింట్ ద్వారా ఎమ్మెల్యేకు అధికారులకు వివరించారు. అదేవిధంగా చెరువు రక్షణార్థం ప్రొటెక్షన్ వాల్ నిర్మాణంతో పాటు నియోజకవర్గంలోని చెక్‌డ్యామ్‌ల అంశంపై చర్చించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిధుల విడుదల తదితర అంశాలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి తగు చర్యల నిమిత్తం లేఖ రాశారు. నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వర్షాకాలం కం టే ము నుపే పనులు పూర్తయ్యేలా అధికారులు సమిష్టి కృషితో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈ నజీర్ హుస్సేన్, నరేంద్రకుమార్, ప్రేమ్‌కుమార్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

### చెరువుతో లాభం చేకూరేది ఎవరికి ?

ముత్యాల చెరువు 2025 వర్షాకాలంలో దెబ్బ తినగా ఆ ప్రభావం మండలంలోని వాడీ, బీరప్ప తండా, హోన్నాజీపేట్ గ్రామ రైతులపై పడింది. రైతులు పెద్ద మొత్తంలో పంట నష్టం వాటిల్లింది. వాడీ, కొండూర్, బీరప్ప తండా లాంటి గ్రామాలలోకి వరదనీరు రావటంతో ఇళ్లు దెబ్బ తిన్నాయి. ఆస్తి నష్టం జరిగింది. మరమ్మతులు చేపట్టవద్దని ఆ సమయంలో రైతులు, గ్రామాల ప్రజలు రోడ్డెక్కి నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. ఇకనైనా జిల్లా సంబంధిత అధికారులు, నాయకులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి కిందిస్థాయి గ్రామాలకు ఎలాంటి ప్రమాదం లేకుండా చర్యలు చేపట్టి ఒక్క నడిమి తండాకు ప్రయోజనం కలిగే లా కాకుండా రిజర్వాయర్‌లా ముత్యాల చెరువును పూర్తి చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తే తప్ప అపోహలు తొలగవని అక్కడి రైతులు ప్రజలు కోరుతున్నారు.

# గన్నీ బ్యాగులు వచ్చేదెప్పుడు..? లారీలు వెళ్లేది ఎప్పుడో..?

వారం గడుస్తున్నా మొదలుకాని తూకం

లారీల కొరతతో కొనుగోళ్లలో ఆలస్యం



ప్రజాపక్షం/నేరడిగొండ: మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్భాటంగా జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి వారం రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు సాగడం లేదు. రైతులు తెచ్చిన జొన్న పంట మార్కెట్ యార్డులు, కల్లాలలోనే మూలుగుతోంది. ఇప్పుడా అప్పుడా అని రైతులు తూకం (కాటా) కోసం ఎదురుచూస్తూ నానా యాతన పడుతున్నారు. అసలే వర్షాకాలం ముంచుకొస్తున్న తరుణంలో, ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ జొన్నలు తడిసి ముద్దవడంతో రైతుల గోడు వర్ణనాతీతంగా మారింది. ఆరుగాలం కష్టపడి యాసంగి సీజన్లో జొన్నలు పండించిన రైతులు తమ పంట అమ్మకాల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని మంగళవారం రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగేపు బొర్రన్న ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడుతుండటంతో మార్కెట్లలోని జొన్నరాశులు తడిసిపోతున్నాయన్నారు. మార్కెట్ అధికారులు వచ్చిన సరుకును వచ్చినట్టుగా గోడౌన్లకు తరలిస్తే రైతులకు నష్టం జరగదని పేర్కొన్నారు. పంటలను ఇళ్లలో, పొలాల్లో నిల్వ చేసుకోలేక కొందరు రైతులు ప్రైవేట్ దళారులను ఆశ్రయించి క్వింటాలుకు రూ. 2700 నుంచి రూ. 3000లోపు తక్కువ ధరకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని మార్క్‌ఫెడ్, పీఏసీఎస్ ద్వారా వెంటనే పూర్తిస్థాయి కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు గన్ని బ్యాగుల కొరత సృష్టించడంతో పాటు రవాణాకు లారీలు లేవంటూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

### 30 లక్షల క్వింటాళ్ల దిగుబడి అంచనా

వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం జిల్లా వ్యాప్తంగా దాదాపు1,12,316 ఎకరాలలో 39,189 మంది రైతులు జొన్న పంటను సాగు చేశారు. ఎకరాకు 20 నుండి 25 క్వింటాళ్ల చొప్పున జిల్లాలో మొత్తం 30 లక్షల క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రభుత్వం స్పందించి, తక్షణమే కొనుగోళ్లు జరిపి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధులు, రైతులు సహేందర్‌రెడ్డి, అంకుష్, సంతోష్, సురేందర్‌రెడ్డి, నిఖిలేష్ పాల్గొన్నారు.

